క్లుప్తంగా

ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు: మండలంలోని నేర చరిత్ర కలిగిన(రౌడీషీటర్లు) వారు ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తన (మంచి గుణగణాల)లను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి ఇతరులపై దాడులకు పూనుకోవడం, అల్లర్లు సృష్టించడం, దొంగతనాలు చేయడం, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడం, భయపెట్టడం వంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంటే ఎంతటివారైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నాడు.

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్

నందవరం : ఆగస్టు 9, 10, 11తేదీల్లో కర్నూలులో జరిగే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ నాయకులు మహాసభల పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఐ శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని మట్టి కలిపేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహాసభలకు కార్మికులు, కర్షకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి శాంతప్ప, నాయకులు ముని, నల్లన్న, భీమన్న, చెన్నప్ప గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యుల సమావేశం నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి అపుస్మా వ్యవస్థాపకుడు కట్టమంచి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీని ఎనుకున్నారు. జిల్లా మెంబర్ మహానందయ్య ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా నాగేంద్ర, కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా దశరథ రాముడుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అపుస్మా ఆదోని డివిజన్ అధ్యక్షుడు ఖాసిం, కౌతాళం అధ్యక్షుడు దూద్‌బాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



గౌతులదొడ్డి వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కౌతాళం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేక ప్రమాదాలకు నిలయంగా మారింది. మండల పరిధిలోని గౌతులదొడ్డి–హాల్వి ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె లేకుండా నాలుగు అడుగుల ఎత్తులోనే ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రయాణికులు హాల్వి, గౌతులదొడ్డి గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రబాబు మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలు చేయని కూటమి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- ఎమ్మిగనూరులో 'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



సమావేశంలో పాల్గొన్న మండలంలోని పార్టీ శ్రేణులు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం తేవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో ఆదివారం చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు మండల పార్టీ విస్తృత సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు బీఆర్ బసిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా వారు చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న సీఎం చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ఒక పింఛన్ మాత్రమే పెంచారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తే అప్పుడు జగనన్న పెట్టిన అమ్మఒడిని పేరు మార్చి తల్లికి వందనం పథకంలో కోతలు కోసి అమలు చేశారని తెలిపారు. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ఇచ్చిన హామీల్లో నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించారని గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో అందించిన పథకాలను వివరించి ఓట్లు అడిగే దమ్ము వుందన్నారు. టీడీపీకి ఓట్లు అడిగేందుకు ఆ పార్టీ శ్రేణులు వెనకడుగు వేసే దుస్థితి ఏర్పడనుందన్నారు.

ఏడాదికే ప్రభుత్వంపై వ్యతిరేకత

ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు చంద్రబాబు మోసపూరిత హామీలను, మోసం చేసిన విధానాన్ని క్యూఆర్‌కోడ్ ద్వారా ప్రజలకు వివరించాలని బుట్టా రేణుక, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు ఇచ్చిందెవరు మోసం చేసిందెవరన్నది స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఏడాదికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. జగనన్న ఐదేళ్ల పాలనలో రెండు సంవత్సరాల కోవిడ్‌లోనూ రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోయినా అందరికీ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, పార్టీ యువ నాయకుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీఆర్ బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డి, ఎంపీపీ కేశన్న, సర్పంచ్‌లు లక్ష్మన్న, రంగస్వామి, లక్ష్మీకాంతరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మల్కాపురం పెద్దయ్య, కందనాతి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పోలయ్య, గుడికల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు గుర్తింపునిచ్చింది జగనన్నే

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యతనిచ్చి అన్ని పదవుల్లో 50 శాతం వారికే కేటాయించారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీలు కూడా బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీసెల్ అధ్యక్షుడిగా నియామకమైన వెంకటాపురం బోయ బజారి, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా నియామకమైన బోయ రాజుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో కృతజ్ఞత



బుట్టారేణుక తదితరులను గజమాలతో సత్కరిస్తున్న పట్టణ బీసీ,యూత్ అధ్యక్షులు బజారి, రాజులు

సభను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆమెతో పాటు పార్టీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠతో పాటు పలువురు నాయకులను వారు గజమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. బుట్టా రేణుక మాట్లాడుతూ.. మాజీ సీఎం జగనన్న బీసీలను బ్యాక్ వర్డ్ క్లాస్‌గా కాకుండా బ్యాక్‌బోన్‌లుగా గుర్తించి వారికి అన్ని విధాలుగా గుర్తింపునిచ్చారన్నారు. అదేవిధంగా కుర్ణికులానికి చెందిన బీసీ అయిన తనకు ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినప్పటికీ తనను గుర్తించి 2104లో ఎంపీగా అవకాశం ఇచ్చి గెలిపించారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మిగనూరు అసెంబ్లీ టికెట్ కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవలింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, బందెనవాజ్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నాగేష్ నాయుడు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నపై ఆరోపణలు మానుకొని అభివృద్ధి చేయండి

మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయడం మానుకొని అభివృద్ధి పనులు చేసి చూపాలని, స్థాయిని మించి జగనన్న గురించి మాట్లాడటం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి తగదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తిని గౌరవించి మాట్లాడాలే కాని స్థాయికి మించి అగౌరవంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. కేవలం రెండు సార్లు ఎమ్మెల్యే అయినంత మాత్రాన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం సబబుకాదన్నారు. తాము ఎప్పుడైనా ప్రభుత్వ వైఫల్యాల గురించే మాట్లాడతామే కాని, ఒక స్థాయిలో వున్న వారిని అగౌరవంగా ఎప్పుడు మాట్లాడమన్నారు. ఏడాది పాలనలో ఎమ్మెల్యేగా మీరు నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏఐఐబీ స్కీంకు రూ.143కోట్లు మంజూరు చేసి ఇంటింటికి కుళాయిలు ఇవ్వాలన్న ఉద్దేశంతో పనులు మొదలెట్టడం జరిగిందన్నారు. అయితే ఎన్నికల కారణంలో చివరి దశలో మిగిలిపోయిందని, దానిని కూటమి ప్రభుత్వంతో పూర్తి చేయించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సత్కరించిన నాయకులు

ఆదోని టౌన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని పెద్దహరివాణం గ్రామానికి చెందిన హనుమంతప్ప, బెంగి బలరామ్, హెచ్.వేమన్న, వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పెద్దహరివాణం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, బెంగి బలరాం, హనుమంతప్ప, హెచ్.వేమన్నకు జిల్లా స్థాయిలో పార్టీ పదవులు దక్కడంతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 13 నెలల పాలనలో జరిగిందేమీ లేదన్నారు. కూటమి పాలనలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు, సాక్షి ప్రతినిధులపై అక్రమ కేసులు, కక్షపూరితమైన చర్యలు తప్పా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాక్షసపాలన కొనసాగుతోందని విమర్శించారు. ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే చెబుతున్నవన్నీ అబద్ధాలే

ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే చెబుతున్నవన్నీ అబద్ధాలేనని, ఒక్కటి కూడా నిరూపించలేదని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఆదోని అభివృద్ధికి రూ.500 కోట్లు తెస్తానన్న ఎమ్మెల్యే 13 నెలలు గడిచినా ఒక్క రూపాయి మంజూరు చేయించలేకపోయారన్నారు. ఆదోని ప్రజలకు వాస్తవాలు ఏమిటో తెలుసునన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి

- సూపర్ సిక్స్ పథకాలు అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- ఏడాది పాలనలో రైతులకు చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం/రూరల్ : ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, కూటమి ప్రభుత్వ, సీఎం చంద్రబాబు మోసాలతో కాలం వెళ్లదీస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హెచ్‌ఆర్‌బీ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో చంద్రబాబు పూర్తిగా విఫలయమ్యారన్నారు. తల్లికి వందనం పథకం అమలు లోపభూయిష్టంగా ఉందన్నారు. ఏడాది పాలనలో రైతుల సంక్షేమం కోసం చేసింది శూన్యమన్నారు. అమరావతి భజనలో పడి రాష్ట్రంలో రైతులు, మహిళలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులు యూరియా కొరతతో నానా తంటాలు పడుతున్నా నోరు మెదపకపోవడం దారుణమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ఉన్న మోజు సంక్షేమ పథకాల అమలుపై లేకపోయిందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ల రాయితీ కూడా వేలాది మందికి పడటం లేదని చెప్పారు. ఆడబిడ్డ సహాయ నిధికి తిలోదకాలిచ్చి మహిళాలోకాన్ని నిలువునా ముంచారన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

రాయలసీమ ప్రాజెక్టులపై కపట ప్రేమ

రాయలసీమ ప్రాజెక్టులపై బాబు కపట ప్రేమ చూపుతున్నారని సీతారామిరెడ్డి విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో ప్రజలకు ఆయన చేసింది ఏమీ లేదన్నారు. పచ్చ తమ్ముళ్ల ఆగడాలకు అండదండగా నిలవడం తప్ప మరేమి ఒరిగింది లేదన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా ఎలాంటి చట్టాలు అమల్లోకి తేలేదన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ గాలికి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ భీమారెడ్డి, కల్లుదేవకుంట సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ రఘునాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడు గురురాజారావు, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచు హోటల్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వల్లంకి పిట్ట పుస్తకావిష్కరణ



హైదరాబాద్‌లో వల్లంకి పిట్ట పుస్తకావిష్కరణ గావిస్తున్న ప్రముఖులు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాల సాహిత్యవేత బాల బంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 74వ పుస్తకం వల్లంకి పిట్ట ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్‌లోని కళాభారతి (ఆర్టీసీ ఎక్స్ రోడు)లో ఘనంగా జరిగింది. వాల్మీకి సాంస్కృతిక, సాహితీ సేవా సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి పద్మశ్రీ డాక్టర్ కొలుకలూరి ఇనాక్, విశ్రాంత అటవీ శాఖ అధికారి ఏఎల్ కృష్ణరెడ్డి, విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారులు డి.రాజగోపాల్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ గావించారు. అనంతరం కవి గద్వాల సోమన్న విశేష కృషి గాను ప్రముఖులు సత్కరించారు. కార్యక్రమంలో సినీ గీత రచయిత సాదనాల వెంకటస్వామి, డాక్టర్ రాధా కుసుమ, గాయకుడు డాక్టర్ అరవా రవీంద్రబాబు, కొప్పుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరయ్య తెలిపారు. మూడు నెలల కొకసారి నిర్వహించే సమావేశంలో మండలంలో వివిధ శాఖల అభివృద్ధి పనుల అమలు తీరుపై చర్చించనున్నట్లు తెలిపారు.

గుర్తింపును రద్దు చేయాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని భాష్యం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త ఏ. తిమ్మప్ప కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్‌టీఈ కింద ఎంపికైన విద్యార్థులకు రెండు నెలలు కావస్తున్నా పుస్తకాలు ఇవ్వకుండా స్కూల్ ప్రిన్సిపాల్, హెచ్ఎంలు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులను వేధిస్తున్నారన్నారు.

విరూపాక్షిరెడ్డికి పరామర్శ

నందవరం: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ముగతి గ్రామ సర్పంచ్ విరూపాక్షిరెడ్డి సతీమణి గొల్ల ఆనందమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి నాగేష్ నాయుడు ఆదివారం విరూపాక్షిరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని నింపారు. గోనెగండ్ల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు అబ్దుల్లాక్ష, మాజీ ఎంపీటీసీ తిమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు చాకలి దుబ్బన్న, దావూద్, మునిస్వామి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల, కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ నంద్యాల, ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) సహకారంతో ప్రముఖ ఎస్ఆర్‌ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 358 రోగులకు వ్యాస్కులర్ వైద్య నిపుణులు డాక్టర్ అనిల్, డాక్టర్ సాయితేజ, శాంతిరాం ఆసుపత్రి నంద్యాలకు చెందిన డాక్టర్ సురేష్‌తో పాటు ఐదుగురు వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి డాక్టర్ సలహా మేరకు రూ.4500 విలువైన కలర్ డాప్లర్ టెస్టులు, 2డీ ఎకో టెస్ట్, రక్తనాళాల పరీక్షలు, ఎకో పరీక్షలు మొదలైన పరీక్షలు చేశారని ఆదోని అవోపా మరియు వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. అవసరమైన 76 మందికి ఉచిత కంటి ఆపరేషన్లకై నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి రెఫర్ చేశారన్నారు. కార్యక్రమంలో రాచోటి సుధాకర్, అవోపా మరియు వామ్ కార్యదర్శులు డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రెండు పూటలా నీరు సరఫరా చేయాలి



ఎల్లెల్సీ కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: ఎల్లెల్సీకి నీరు విడుదలైనందున చెరువులో, ఎస్ఎస్ ట్యాంక్‌లలో పుష్కలంగా నీరు ఉన్నాయని, పట్టణ వాసులకు కుళాయిలకు రెండు పూటలా మంచినీటిని సరఫరా చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ మున్సిపల్ అధికారులను కోరారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఎల్లెల్సీతో పాటు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. ఎల్లెల్సీ ద్వారా నీరు వచ్చినందున తాగు నీటి అవసరాలకోసం పంపింగ్ చేసే నీటిని సక్రమంగా శుద్ధి చేసి సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి ఫోన్ ద్వారా కోరారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, హనీఫ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తుంగాతీరం.. సాగు సంబరం



వరినాట్లు వేస్తున్న కూలీలు

నందవరం : తుంగభద్ర నది నిండుగా ప్రవహిస్తుడడంతో నది తీరం ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. మడుల దమ్ము చేస్తున్న ట్రాక్టర్ల సవ్వడి, కూలీల కోలాహలం, కాడెద్దుల రంకెలు, గలగల పారే జలకళతో నదీతీరం కనువిందు చేస్తోంది. నందవరం మండలం నది తీరం ప్రాంతం 24 కిలో మీటర్ల మేర వరినాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ వరినాట్లు ఊపందుకోవడంతో నదీ తీరమంతా సందడిగా మారింది. నాగలదిన్నె, గురజాల, చిన్నకొత్తిలి, జొహరాపురం, నదికైరవాడి తదితర గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సారైనా కూటమి సర్కారు వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతన్నలు ఆకాంక్షిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు, పెట్టుబడి సాయం, సబ్సిడీపై ఎరువులు అందించాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌తో మడి సిద్ధం చేసుకుంటున్న దృశ్యం



వరిమడిని చదును చేస్తున్న రైతన్న

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు పార్టీ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి హాజరు అవుతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.